క్లుప్తంగా

పది మంది రక్తదానం



ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో రక్తదానం చేస్తున్న ఎస్‌ఐ శ్రీనివాస నాయక్

అమలాపురం టౌన్: స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో పది మంది రోగులకు అత్యవసరంగా రక్తం అవసరమవ్వగా అల్లవరం ఎస్‌ఐ ఎల్.శ్రీనివాసనాయక్ సహా 10 మంది ఆదివారం ఉదయం రక్తదానం చేశారు. అమలాపురం శ్రీస్వామి వివేకానంద యోగాశ్రమం గురువు శ్రీనివాస్ ఆధ్వర్యంలో రక్తదాన కార్యక్రమం జరిగింది. ఆస్పత్రి వైద్యులు రక్తదానం చేసిన ఎస్‌ఐతో పాటు యువకులకు కృతజ్ఞతలు తెలిపారు. యువకులు వాకాడ ఉమ, నల్లా నాని, వాకాడ శ్యామ్, కాండ్రేగుల దిలీప్, పైండా విఘ్నేష్, పోచనపెద్ది శ్రీకాంత్, నార్ని మౌళి, సత్తి విమల్, యాళ్ల మహేష్‌లు రక్తదానం చేశారు.

హోంగార్డుల నోటిఫికేషన్ కోసం ఎదురుచూపులు

యానాం: పుదుచ్చేరివ్యాప్తంగా ఉన్న నాలుగు రీజియన్లలోని పోలీసుశాఖలో హోంగార్డు పోస్టుల భర్తీ కోసం నిరుద్యోగులు ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే పోలీసు కానిస్టేబుల్ పోస్టులకు సంబంధించి నోటిఫికేషన్ విడుదలై ఫిజికల్ ఫిట్‌నెస్ పరీక్షలు సైతం నిర్వహించారు. ఈ నేపథ్యంలో 500 హోంగార్డు పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ వేస్తామని ప్రభుత్వం ఇటీవల ప్రకటించింది. దీంతో కానిస్టేబుల్ ఫిజికల్ ఫిట్‌నెస్ పరీక్షల్లో ఫెయిలైన వారితో పాటు పలువురు నిరుద్యోగులు హోంగార్డుల నోటిఫికేషన్ ఎప్పుడెప్పుడు విడుదలవుతుందా అని వేయికళ్లతో వేచి చూస్తున్నారు. నోటిఫికేషన్‌కు సంబంధించిన ఫైలు పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌కు చేరిందని, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆమోదంతో రెండువారాల్లోగా ఉత్తర్వులు విడుదలయ్యే అవకాశాలున్నట్లుగా పోలీస్‌శాఖలో చర్చ సాగుతోంది.

వేములమ్మ అమ్మవారి వార్షికోత్సవం

అల్లవరం: ఎంట్రుకోనలో కొలువైన కనకలక్ష్మీ వేములమ్మ అమ్మవారి 6వ వార్షికోత్సవ పూజలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక సర్పంచ్ తిక్కరెడ్డి శ్రీనివాస్ దంపతులచే అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వంగా శ్రీనివాసరావు దంపతులు అమ్మవారికి వెండి త్రిశూలం సమర్పించారు. ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జెడ్పీటీసీ కొనుకు గౌతమి తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

మొగళ్ళమూరులో ఫ్లెక్సీ వివాదం

అల్లవరం: మొగళ్ళమూరు పంచాయతీ పరిధిలోని గోగువారిపేట వెళ్లే దారిలో జ్యోతిరావు పూలే, దొమ్మేటి వెంకటరెడ్డి ఫొటోలతో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని శనివారం అర్ధరాత్రి ధ్వంసం చేశారు. ఫ్లెక్సీ ధ్వంసంపై స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ శ్రీనునాయక్ ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. ఫ్లెక్సీ ధ్వంసం కేసులో మొగళ్ళమూరు గ్రామానికి చెందిన ఐదుగురు, తుమ్మలపల్లి గ్రామానికి చెందిన మరో వ్యక్తిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. కేసుని వేగంగా చేధించి నిందితుల్ని పట్టుకోవడంలో కీలక పాత్ర పోషించిన ఎస్‌ఐ శ్రీనునాయక్‌ని గ్రామస్తులు అభినందించారు.

తడిసిన పొలాల పరిశీలన



రోళ్లపాలెం బైపాస్ రోడ్డులో తడిసిన ధాన్యం పరిశీలిస్తున్న ఆర్డీవో వసంతరాయుడు

అమలాపురం రూరల్: అకాల వర్షాలు వల్ల దెబ్బతిన్న పంటలపై నివేదికను కలెక్టర్ హిమాన్షు శుక్లాకు అందిస్తామని, ఆయన తగు చర్యలు తీసుకుంటారని ఆర్డీఓ వసంతరాయుడు అన్నారు. ఆదివారం రోళ్లపాలెం గ్రామంలో బైపాస్ రోడ్డులో తడిసిన పంటలను పరిశీలించారు. కళ్లాల్లో ధాన్యంను పరిశీలించి రైతులతో మాట్లాడారు. వాతావరణ పరిస్థితులపై రైతులకు సమాచారం ఇచ్చారు. ఆయన వెంట తహసీల్దార్ పరమట శ్రీ పల్లవి, వ్యవసాయ అధికారి కె. ధర్మప్రసాద్ ఉన్నారు.

30న కన్యకా పరమేశ్వరి జన్మదినోత్సవం

అమలాపురం టౌన్: స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ఈనెల 30న అమ్మవారి జన్మదినోత్సవాన్ని నిర్వహించేందుకు ఆలయ ఉత్సవ కమిటీ ఏర్పాట్లు చేస్తోంది. అమ్మవారికి లక్ష మల్లె పూల పూజా మహోత్సవంతో పాటు పల్లకీలో గ్రామోత్సవం, సామూహిక కుంకుమ పూజలు నిర్వహించనున్నారు. ఆలయంలో అమ్మవారిని ప్రతిష్ఠించిన రోజైన ఈ నెల 25న వివిధ పండ్ల రసాలతో అమ్మవారిని అభిషేకించి ప్రత్యేక పూజలు చేయనున్నట్లు ఉత్సవ కమిటీ చైర్మన్ నందిపాటి శ్రీనివాస్ తెలిపారు. ఆయా పూజోత్సవాల కరపత్రాలను ఆలయంలో వైశ్య సంఘ నాయకులు విడుదల చేశారు. పట్టణ వైశ్య సంఘం అధ్యక్షుడు యెండూరి వెంకట్రామయ్య, కో చైర్మన్ పచ్చిగోళ్ల సోమరాజు, సంఘ ప్రతినిధులు వరదా సూరిబాబు, అప్పన వీరన్న, సింగంశెట్టి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అకాల వర్షం.. అన్నదాత కలవరం

- పొలాల్లో తడిసి ముద్దయిన ధాన్యం, పనలు
- ఈదురుగాలులతో నేలకొరిగిన చెట్లు, స్తంభాలు



భీమనపల్లిలో వర్షానికి తడిసిన వరి పనలను అధికారులకు చూపిస్తున్న రైతు

ముమ్మిడివరం/అల్లవరం/ఉప్పలగుప్తం/కాట్రేనికోన/అమలాపురం టౌన్: అకాల వర్షం అన్నదాతలను ఆందోళనలో పడేసింది. చేతికొచ్చిన పంటను నీళ్ల పాలుజేసి రైతుల కంట కన్నీళ్లు మిగిల్చింది. వాయువ్య మధ్యప్రదేశ్ నుంచి దక్షిణ తమిళనాడు వరకూ కొనసాగుతున్న ద్రోణి కారణంగా ఆదివారం తెల్లవారుజాము నుంచి ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం పడింది. దీంతో మాసూలు చేసి విక్రయానికి సిద్ధం చేసిన ధాన్యం బస్తాలు, రాశులు తడిసి ముద్దయ్యాయి. ధాన్యం విక్రయించి సొమ్ము చేసుకోవాలనుకున్న అన్నదాతలకు నిరాశే మిగిలింది. మరోవైపు ఈదురుగాలుల కారణంగా పలుచోట్ల చెట్లు, విద్యుత్ స్తంభాలు కుప్పకూలి విద్యుత్ సరఫరాకు ఆటంకం ఏర్పడింది.

అమలాపురంలో అత్యధికం

జిల్లావ్యాప్తంగా ఆదివారం ఒక్కరోజే సరాసరిన 15.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైతే అత్యధికంగా అమలాపురం మండలంలో 47.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావడం గమనార్హం. ఉప్పలగుప్తం మండలంలో 39.2 మి.మీ., ఐ.పోలవరం మండలంలో 28.2 మి.మీ., కాట్రేనికోన మండలంలో 21.2 మి.మీ., అల్లవరం మండలంలో 16.4 మి.మీ. వర్షపాతం నమోదైంది. గత వారం రోజులుగా ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరగడంతో చాలామంది రైతులు యంత్రాలతో వరి కోతలు కోసి ధాన్యాన్ని ఎండ బెట్టి రాశులు, కుప్పల మీద వరి చేలల్లోనే ఉంచారు. అయితే ఆదివారం తెల్లవారుజామున అకస్మాత్తుగా కురిసిన వర్షంతో అవన్నీ తడిసి ముద్దయ్యాయి. తెల్లవారుజామున చిరుజల్లులతో మొదలైన వర్షం ఉదయానికి భారీ వర్షంగా మారింది. ఉదయం 10 గంటల తరువాత వర్షం తగ్గుముఖం పట్టడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. తడిసిన ధ్యాన్ని ఎండబెట్టుకునే పనుల్లో నిమగ్నమయ్యారు.

ఇదీ పరిస్థితి

- అల్లవరం మండలంలో ఆదివారం ఉదయం సుమారు గంటన్నర పాటు కురిసిన భారీ వర్షానికి పల్లపు చేలల్లో వర్షపు నీరు చేరింది. వందలాది ఎకరాల్లో వరి పనలు తడిసిపోయాయి. తహసీల్దార్ ఎన్ఎస్ఎస్ ప్రసాద్, వ్యవసాయాధికారి, వ్యవసాయ సహాయకులు కోడూరుపాడు, గూడాల తదితర గ్రామాల్లో పర్యటించి భారీ వర్షానికి తడిసిన వరి పొలాలను పరిశీలించారు. వరి పనలు మొలకెత్తకుండా ఉప్పు నీటి ద్రావణాన్ని పిచికారీ చేయాలని వ్యవసాయాధికారులు రైతులకు సూచించారు.
- ఉప్పలగుప్తం మండలంలో మండలంలో 3,480 ఎకరాల్లో కోతలు పూర్తవగా అకాల వర్షం కారణంగా 184 ఎకరాల్లో పనలపై ఉన్న వరి పంట తడిసిందని, మరో 56 ఎకరాల్లో వరి నేలకు ఒరిగిందని వ్యవసాయధికారులు స్పష్టం చేశారు. వర్షం కారణంగా ముంపుకు గురైన పొలాలను వ్యవసాయాధికారి జి.కుమార్‌బాబుతో కలిసి తహసీల్దార్ జవ్వాది వెంకటేశ్వరి పరిశీలించారు.
- ముమ్మిడివరం మండలంలో ఈదురు గాలులకు అక్కడక్కడా చెట్ల కొమ్మలు, కొబ్బరి చెట్లు విరిగి పడ్డాయి. విద్యుత్ తీగలు తెగి పడ్డాయి. ఆదివారం మధ్యాహ్నం వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు.
- కాట్రేనికోన మండలంలోని అన్నంపల్లి–పల్లంకుర్రు ప్రధాన కాలువ నుంచి ఎస్.కొత్తపల్లి వెళ్లే పంట కాలువ గేట్లు చేపల చెరువుల కోసం పూర్తిగా ఎత్తివేయడంతో కాలువ వెంబడి ఉన్న పంట చేలకు నీరు పోటెత్తిందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.
- కాట్రేనికోన పంచాయతీ కాపులపాలెంలో విద్యుత్ వైరుపై కొబ్బరి చెట్టు పడి విద్యుత్ తీగలు దెబ్బతిన్నాయి. పల్లంకుర్రులో కొబ్బరి చెట్టు పడిపోవడంతో రోడ్డుపక్కన నిలిపి ఉన్న ఆటో పూర్తిగా దెబ్బతింది. ఆ సమయంలో ఆటోలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది.
- అమలాపురం పట్టణంలో ఆదివారం ఉదయం వర్షం కురుస్తున్న సమయంలో స్థానిక గొల్లగూడెం బైపాస్ రోడ్డులో టిప్పర్, బొలెరో వాహనాలు ఒకదానినొకటి ఢీకొన్నాయి. అయితే ఈ ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.



దేవగుప్తంలో వర్షానికి తడిసిన వరి పనలు



అన్నంపల్లిలో వర్షానికి తడిసిన ధాన్యం బస్తాలు



గాడిలంకలో బరకాలతో కప్పుకున్న ధాన్యం రాశులు

అడహాక్ కమిటీ ఏర్పాటు



కోనసీమ జిల్లా అడహాక్ కమిటీ కార్యవర్గం

అమలాపురం రూరల్: స్థానిక ఈదరపల్లిలో ఏపీ ఎస్ఈబీ సొసైటీ భవనంలో ఏపీ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం సమావేశం ఆదివారం జరిగింది. ముఖ్య అతిథులుగా రాష్ట్ర కార్యదర్శి జి.ఆస్కారరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.శ్రీకాంత్ పాల్గొన్నారు. కోనసీమ జిల్లాకు నూతన కార్యవర్గం ఎంపిక కోసం అడహాక్ కమిటీని నియమించారు. అధ్యక్షుడిగా పప్పు సుబ్బారాయుడు, కార్యదర్శిగా నక్కా ఆదిలక్ష్మి, కోశాధికారిగా కొప్పిశెట్టి బోస్ నాగ రామలింగేశ్వర శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శిగా నెల్లి మధుబాబు, అసోసియేట్ అధ్యక్షుడిగా ఎం.బాపూజీ ఎన్నికైనట్టు ప్రకటించారు. ఈ నెల 30న రాజమహేంద్రవరం ఆనం కళాకేంద్రంలో జరిగే సమావేశంలో ఉద్యోగుల సమస్యలపై చర్చించి పోరాట ప్రణాళిక సిద్ధం చేస్తామని తెలిపారు.

24 నుంచి గడప గడపకూ మన ప్రభుత్వం

అల్లవరం: ఈ నెల 24 నుంచి 29 వరకూ కొమరగిరిపట్నం, అల్లవరం, గోడితిప్ప గ్రామాల్లో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తారని ఎంపీడీఓ జి.సరోవరరావు ఆదివారం తెలిపారు. 24, 25 తేదీల్లో కొమరగిరిపట్నంలో, 26, 27 తేదీలో అల్లవరంలో, 29న గోడితిప్ప గ్రామాల్లో నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు పాల్గొంటారని తెలిపారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి



భట్నవెల్లిలో అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న మంత్రి విశ్వరూప్



ఎస్.యానాంలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మంత్రి విశ్వరూప్

మంత్రి పినిపే విశ్వరూప్

అమలాపురం రూరల్: అంబేడ్కర్ ఆశయ సాధనకు యువత కృషి చేయాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. భట్నవిల్లి అంబేడ్కర్‌నగర్‌లో అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో అంబేడ్కర్ 132వ జయంతి వేడుకలు ఆదివారం నిర్వహించారు. సర్పంచ్ తిరుకోటి సుజాత అధ్యక్షతన జరిగిన సభలో మంత్రి విశ్వరూప్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. తొలుత గ్రామంలో యువత ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీలో మంత్రి పాల్గొన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ యిళ్ల గోపాలకృష్ణ, ఎంపీటీసీ తొత్తరమూడి మరయమ్మ, వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా కార్యదర్శి తిరుకోటి సతీష్‌కుమార్, పెనుమాల సత్యనారాయణ, పాకా జాన్‌కుమార్, మామిశెట్టి సుబ్రహ్మణ్యం, నక్కా శ్రీనివాస్, జినిపే కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ స్ఫూర్తితో మెలగాలి

ఉప్పలగుప్తం: ప్రపంచ మేధావి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్ఫూర్తితో ప్రజలంతా మెలగాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. మండలంలోని ఎస్.యానాం గ్రామ పంచాయితీ పరిధి జల్లివారిపేటలో నూతనంగా ఏర్పాటుచేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి విశ్వరూప్ మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేసి అందరూ విద్యావంతులు కావాలని సూచించారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గెడ్డం సంపదరావు, ఉప సర్పంచ్ పెట్టా మురళీకృష్ణ, అయితాబత్తుల సూరిబాబు, జోగి రాజా, ఇసుకపట్ల రఘుబాబు, పొగాకు శ్రీను, లంకే శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు ఆదర్శం కామిశెట్టి సావిత్రి జీవితం

ఘనంగా శత జయంతి ఉత్సవం



కామిశెట్టి సావిత్రి శత జయంతిలో పాల్గొన్న ఆర్‌ఏఓ మునిస్వామి తదితరులు

యానాం: యానాంను ఫ్రెంచి వారి నుంచి విముక్తి చేయడంలో స్వాతంత్ర్య సమరయోధురాలు కామిశెట్టి సావిత్రి చేసిన పోరాటం నేటి మహిళలకు ఆదర్శంగా నిలుస్తుందని ఆర్‌ఏఓ మునిస్వామి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక రాజీవ్ బీచ్‌లో ఆమె విగ్రహం వద్ద జరిగిన శత జయంతి ఉత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. యానాం మొట్టమొదటి మహిళా ఎమ్మెల్యేగా, పట్టణ మేయర్‌గా అనేక పదవులు అధిష్ఠించి ప్రజాసేవ చేసిన కామిశెట్టి సావిత్రి చిరస్మరణీయురాలన్నారు. ఈ సందర్భంగా పలువురు కామిశెట్టి సావిత్రి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సివిల్ రైట్స్ సొసైటీ అధ్యక్షుడు పొనుగుమట్ల విష్ణుమూర్తి, కామిశెట్టి సావిత్రి మనవరాలు పైడికొండల సావిత్రి ఆండాల్, రాజబాబు, కోడలు సూర్యలక్ష్మి, వెలగా కోటేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా ప్రమాణ స్వీకారోత్సవ ర్యాలీ



ర్యాలీగా వెలుతున్న కుడుపూడికి పూలమాల వేసి స్వాగతం పలుకుతున్న చింతలపాటి శ్రీనివాసరాజు

తాళ్లరేవు: ముమ్మిడివరం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసేందుకు కుడుపూడి శివన్నారాయణ భారీ ర్యాలీగా తరలివెళ్లారు. ఆదివారం ఉదయం 9 గంటలకు పి.మల్లవరం గ్రామ పంచాయతీ పత్తిగొందిలోని ఆయన స్వగృహం నుంచి వేలాది మంది కార్యకర్తలు, అభిమానులు కార్లు, మోటారు సైకిళ్లపై ర్యాలీగా ముమ్మిడివరం తరలివెళ్లారు. కుడుపూడికి ఆయన అభిమానులు పూలమాలలు, పుష్పగుచ్ఛాలతో ఘన స్వాగతం పలికారు. సుంకరపాలెం జంక్షన్‌లో వైఎస్సార్‌సీపీ రాష్ట్రనేత చింతలపాటి శ్రీనివాసరాజు కుడుపూడికి గజమాల వేసి స్వాగతం పలికారు. పి.మల్లవరం నుంచి వై.జంక్షన్, సుంకరపాలెం, ఎదురులంక, మురమళ్ల, మీదుగా ముమ్మిడివరం గ్రాండ్‌పార్క్ కల్యాణ మండపం వరకు ర్యాలీ జరిగింది. కార్యక్రమంలో ఎంపీపీ రాయుడు సునీత, జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్ సాగర్, రాష్ట్ర నాయకులు దున్నా జనార్దనరావు, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు టేకుపూడి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. మార్కెటింగ్ కమిటీ వైస్ చైర్మన్‌గా ఎస్సీ సామాజికవర్గానికి చెందిన కాశి హనుమంతరావుకు కేటాయించడంతో అధిక సంఖ్యలో నాయకులు కాట్రేనికోన నుంచి తరలి వెళ్లారు.

సేవలకు గుర్తింపుగా ప్రశంసా పత్రం



ప్రశంసా ప్రతాన్ని అందుకుంటున్న లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సుమన్‌వర్మ

అమలాపురం టౌన్: అమలాపురం లయన్స్ క్లబ్ 2022–23 సంవత్సరానికి చేపట్టిన సేవా కార్యక్రమాలకు గుర్తింపుగా ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ ప్రశంసా పత్రం లభించింది. రాజమహేంద్రవరం మోరంపూడిలో ఆదివారం జరిగిన లయన్స్ జిల్లా 316 బి కన్వెన్షన్‌లో ఈ ప్రశంసా పత్రాన్ని అందుకున్నట్లు స్థానిక క్లబ్ అధ్యక్షుడు జంపన సుమన్‌వర్మ తెలిపారు. లయన్స్ ఇంటర్నేషనల్ ప్రతనిధి వి.విజయకుమార్‌రాజు, జిల్లా గవర్నర్ మాటూరి మంగతాయారు చేతుల మీదుగా ఈ పత్రాన్ని అందుకున్నానని పేర్కొన్నారు.

లయన్స్ క్లబ్‌కు ప్రశంసా పత్రం

తాళ్లరేవు: స్థానిక లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో జరుగుతున్న కొప్పిశెట్టి లక్ష్మయ్య బ్రహ్మార్పణ్ ఉచిత అభాగ్యుల భోజన పథకాన్ని మెచ్చి లయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ ప్రశంసా పత్రాన్ని అందజేసింది. రాజమహేంద్రవరంలో జరిగిన 5వ యాన్యువల్ డిస్ట్రిక్ట్ కన్వెన్షన్‌లో భాగంగా క్లబ్ అధ్యక్షుడు బిళ్లకుర్తి శ్రీనివాసరెడ్డికి ఇంటర్నేషన్ బోర్డు డైరెక్టర్ వి.విజయ్‌కుమార్ ప్రశంసాపత్రాన్ని అందజేశారు.

అమలాపురంలో పుస్తక దినోత్సవం



రచయిత సత్యనారాయణమూర్తిని సత్కరిస్తున్న వాకర్స్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: స్థానిక వాకర్స్ హెల్త్ క్లబ్ ఆధ్వర్యంలో కొంకాపల్లిలో ప్రపంచ పుస్తక దినోత్సవం ఆదివారం సాయంత్రం జరిగింది. ఈ సందర్భంగా పట్టణానికి చెందిన దశాధిక గ్రంథ రచయిత, విశ్రాంత ఉపాధ్యాయుడు చెక్కా సత్యనారాయణమూర్తిని వాకర్స్ క్లబ్ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. మంచి పుస్తకం ఓ మంచి మిత్రునితో సమానమని సత్కార గ్రహీత సత్యనారాయణమూర్తి అన్నారు. కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ కార్యదర్శి పుత్సా కృష్ణ కామేశ్వర్, వాకర్స్ జిల్లా ఉప గవర్నర్ సప్పా నాగేశ్వరరావు, ఏరియా కో ఆర్డినేటర్ తేతల సత్యనారాయణరెడ్డి, క్లబ్ కోశాధికారి పచ్చిగోళ్ల రాజా, ప్రొఫెసర్ గోకరకొండ నాగేంద్ర తదితరులు ప్రసంగించారు.

శివన్నారాయణను అభినందించిన మంత్రి వేణు



కుడుపూడి శివన్నారాయణకు పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందిస్తున్న మంత్రి వేణు

తాళ్లరేవు: ముమ్మిడివరం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన కుడుపూడి శివన్నారాయణను రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ అభినందించారు. ఆదివారం సాయంత్రం పత్తిగొందిలోని శివన్నారాయణ ఇంటికి విచ్చేసిన మంత్రి వేణు కేక్ కట్ చేసి ఆయనకు తినిపించారు. అనంతరం శివన్నారాయణను దుశ్శాలువా, పుష్పగుచ్ఛంతో సత్కరించారు.

ఈ సందర్భంగా మంత్రి వేణు విలేకర్లతో మాట్లాడుతూ సామాజిక న్యాయంలో భాగంగా శివన్నారాయణకు మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి కట్టబెట్టడం చారిత్రక నిర్ణయమన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించడంతో శివన్నారాయణకు ఈ పదవి దక్కిందన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే బీసీలకు రాజకీయ ప్రాధాన్యత ఇస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో బొంతు సత్యశ్రీనివాస్, రెడ్డి సతీష్, విశ్రాంత జేడీ పెట్ల సూర్యనారాయణరాజు, కుడుపూడి శ్రీనివాస్, దడాల హరీష్, బల్ల ప్రసాద్, దున్నా శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పంచాయతీలకు అవార్డుల ప్రదానం

తాళ్లరేవు: జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా వివిధ కేటగిరీల్లో ఎంపిక చేసిన పంచాయతీలకు సోమవారం అవార్డు ప్రదానం చేయనున్నట్లు ఎంపీడీఓ ఎం.అనుపమ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రాయుడు సునీత అవార్డులను ప్రదానం చేస్తారన్నారు. కార్యక్రమానికి మండల పరిషత్ సభ్యులు, సర్పంచ్‌లు ప్రతిఒక్కరూ హాజరు కావాలని ఎంపీడీఓ కోరారు.

కావాలొక కొత్త ప్రణాళిక

- అమలాపురం రైతు బజారు మూసివేత
- ప్రత్యామ్నాయాలపై దృష్టి సారించిన మార్కెటింగ్ శాఖ



మూత పడిన అమలాపురం రైతు బజారు

అమలాపురం టౌన్: ఆర్టీసీ బస్‌స్టేషన్‌కు సమీపంలో మెయిన్ రోడ్డును ఆనుకుని 90 పక్కా దుకాణాల సముదాయంతో సువిశాలంగా ఉన్న అమలాపురం రైతు బజారు మూత పడింది. వినియోగదారుల నిరాదరణ, వ్యాపారుల అనాసక్తి వల్ల ఏళ్ల తరబడి ఒకే ఒక్క షెడ్డులో ఇక్కడ కూరగాయల దుకాణం నడుస్తోంది. ఇప్పుడు ఆ దుకాణ యాజమానికి అనారోగ్యం రావడంతో అది కూడా మూతపడింది. దీంతో మొత్తం రైతు బజార్ సముదాయం నిరుపయోగంగా దర్శనమిస్తోంది. దీంతో ప్రత్యామ్నాయ మార్గాలపై జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారులు కసరత్తులు సాగిస్తున్నారు.

2000 సంవత్సరంలో అప్పటి టీడీపీ ప్రభుత్వం రూ.కోటి వ్యయంతో ఉమ్మడి జిల్లాలోనే అతి పెద్ద రైతు బజారును మోడల్‌గా నిర్మించింది. అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ బజార్‌ను ప్రారంభించి రాష్ట్రంలోనే ఇదో మోడల్ రైతు బజార్ అని గొప్పలు చెప్పారు. పట్టణానికి ఓ మూలకు విసిరేసినట్లు ఉండే స్థలంలో ఈ రైతు బజారును అనాలోచితంగా నిర్మించారని అప్పట్లోనే విమర్శలొచ్చాయి. మొదట్లో 25 దుకాణాలతో మొదలైన ఈ బజారు కొంతకాలానికే క్రమేపీ ఒక్కొక్కటీ కనుమరుగవుతూ చివరకు ఒకే దుకాణం మిగిలింది. అదీ వ్యాపారి అనారోగ్యంతో ఇటీవల మూతపడింది. దీంతో దుకాణాల్లేని ఆ బజార్‌ను మార్కెటింగ్ సూపర్‌వైజర్, సెక్యూరిటీ గార్డు పర్యవేక్షిస్తున్నారు.

> **పూర్తి స్థాయి వినియోగంలోకి తెస్తాం**
>
> పట్టణ రైతు బజారును పూర్తి స్థాయి వినియోగంలోకి తెచ్చే ప్రయత్నం చేస్తున్నాం. 15 మంది మత్స్యకారులు చేపల దుకాణాలు పెట్టుకునేందుకు ఒప్పందాలు కుదిరాయి. రైతు బజార్‌లో దుకాణాలన్నీ భర్తీ చేసే ప్రత్యామ్నాయ మార్గాలపై మున్సిపల్ కమిషనర్‌తో చర్చించాం. మా శాఖ అధికారులమంతా దీనిపై కసరత్తు చేస్తున్నాం.
>
> – కె.విశాలాక్షి, జిల్లా వ్యవసాయ మార్కెటింగ్ అధికారి

చేపల మార్కెట్‌కు అవకాశమిస్తే

ఈ రైతు బజారులో చేపల మార్కెట్‌కు అవకాశం కల్పిస్తే వినియోగదారుల రాక ఎక్కువై కూరగాయల దుకాణాలు కూడా పెరుగుతాయన్న ఆలోచనలో మార్కెటింగ్ శాఖ అధికారులున్నారు. ప్రధానమంత్రి మత్స్య యోజన పథకం కింద 15 మంది చేపల విక్రయదారులు రైతు బజారుకు వచ్చేందుకు అంగీకరించారు. అంతేకాకుండా పట్టణంలో రోడ్ల చెంత పలు చోట్ల తోపుడు బండ్లపైనే కూరగాయలు అమ్మే దుకాణాల్ని రైతు బజారుకు మళ్లిస్తే ట్రాఫిక్ సమస్య సైతం తీరుతుందని సీనియర్ సిటిజన్లు సూచిస్తున్నారు.

కోడి పందేల శిబిరంపై దాడి

తాళ్లరేవు: మండల పరిధిలోని జి.వేమవరం పంచాయతీలో కోడి పందేల శిబిరంపై దాడి చేసి ఇద్దరు ముద్దాయిలను అరెస్ట్ చేసినట్లు కోరంగి ఎస్‌ఐ పి.శ్రీనివాసకుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు తమకు అందిన సమాచారం మేరకు దాడి చేయగా ఇద్దరు వ్యక్తులు పట్టుబడ్డారన్నారు. వారి నుంచి రెండు కోళ్లు, రూ.900 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.